



# మరో లింగరాజు కథ

బొల్లిముంత నాగేశ్వరరావు

"**ఇంతకూ** మంగ తాయారును చేసుకోనంటావ్?'' మరోసారి గద్దించి అడిగారు బలరాం గారు.

''ఎన్నిసార్లు చెప్పాలేమిటి? పెళ్ళనేది నా ఇష్టం. నా ఇష్ట మొచ్చినమ్మాయిని చేసుకుంటాను.'' శ్రీనివాసు గట్టిగానే అన్నాడు.

''నీ ఇష్టమొచ్చిన అమ్మాయంటే?''

''అర్థం కాలేదా ... నాకు ఇష్టం కలిగిన అమ్మాయి.''

''వివాహానికి ముందే ఇష్టం కలుగుతుందా?''

''అదంతా మీ కనవసరం.''

''సరే ... అనవసర మంటున్నావు కాబట్టి చెప్తున్నా. నీవు నీ ఇష్ట మొచ్చిన అమ్మాయినే పెళ్ళి చేసుకో. నీ కీ ఆస్తిలో చిల్లిగవ్వ కూడా దక్కదు. ఇంట్లో సూది మొన మోపిన స్థలం కూడా భాగంగా రాదు.''

''చిల్లిగవ్వలూ, సూది మొనలూ నా కక్కర్లేదు.''

''సరే ... తేలుస్తాను.''

''ఏమిటి మీరు తేల్చేది?'' శ్రీనివాసు దురుసుగా అని అక్కడి నుంచి వెళ్ళిపోయాడు.

ఈ సంభాషణ అంతా వింటూ కళ్ళలో నీళ్ళు నింపుకున్న సుభద్ర కాస్సేపు అలాగే కొయ్యబారింది. నిన్న మొన్నటి వరకూ శ్రీనివాసుకు తాయారును చేసుకుంటానని తన తండ్రి తన తోనే పదే పదే అంటుండేవాడు. శ్రీనివాసు కూడా ఆ మాటలు విని చిన్నగా నవ్వి పూరుకునే వాడు. తాయారు విషయంలో తన కయిష్టమున్నట్టు వాడింతకు ముందెన్నడూ కనపరచలేదు.

కానీ ... ఇప్పుడు హటాత్తుగా వాడు తాయారును చేసుకో నంటున్నాడు!

తన తాయారు కేం ... సలక్షణంగా ఉంటుంది. పదో తరగతి పాసయ్యింది. మనిషి ఎర్రగా, బొద్దుగా, ముద్దుగా ఉంటుంది. కళ్ళు చారెడంత వెడల్పుగా ఉంటాయి. పెద్దగా కనిపించే ఆ కళ్ళ క్రింద చారుగా మొనతేలిన ముక్కు ఉంటుంది.

కుందనం బొమ్మలా ఉండే తన కూతురు శ్రీనివాసుకు నచ్చలేదా?!

కారణం... తనకు ఆస్తి లేకపోవటమేనా?

అస్తినీ, అందాన్నీ అనుభవించటం మనిషికి అదృష్టమే అయితే ... శ్రీనివాసుకు ఆస్తి ఉంది. లక్షల ఖరీదు చేసే రెండు మేడలున్నాయి. వ్యాపార ముంది. బాంకుల్లో బంగార ముంది.

తన కుమార్తె ఆస్తిని తేలేక పోవచ్చు! కానీ ఎవ్వరూ తేలేని అందాన్ని ఆ యింటికి తెస్తుంది.

ఆస్తి గొప్పదా? అందం గొప్పదా?

''ఈ దేశంలో అడ్డదా రనుకున్న దేన్ని తొక్కినా ఆస్తిని సంపాదించొచ్చు.'' తరచూ తన భర్త అన్న మాటలు ఆ సమయంలో ఆమెకు గుర్తువచ్చాయి.

మరి అందాన్ని సంపాదించగలరా? ఎన్ని తిప్పలు పడినా లేని అందాన్ని కొని తెచ్చుకోలేరు.

చప్పిడి ముక్కు కోటేరు లాంటి కొనతేలిన ముక్కులా రాదు! గుంట కళ్ళు విశాలంగా ఉండే లేడి కళ్ళులా రావు. గుంటలు పడిన బుగ్గలు నున్నగా ఉండే గులాబీలు తేలే బుగ్గలు కావు...!

శ్రీనివాసు కీ సంగతి తెలీదా?

లేక తన కుమార్తె కంటే మరింత అందంగా ఉండే మరో అమ్మాయి నెక్కడయినా చూసి ఇష్ట పడ్డావా? ఏమో ... ఎందుక్కాకూడదు.

కాకిపిల్ల కాకికి ముద్దు. తన కుమార్తె కంటే అందమైన వాళ్ళు ఉండరని ఎందుకు తలపోయాలి.

సుభద్ర హతాశురా లయ్యింది!

అందంగా ఉండే తన కుమార్తె ఐశ్వర్యం లోకి అడుగు పెడుతుందని కలలు కంది!

కానీ శ్రీనివాసు ఎదురు తిరిగాడు!

శ్రీనివాసు ...

సుభద్రకు స్వయంగా తమ్ముడు.

ఒకే ప్రేవులోంచి అండ రూపంలో వారిద్దరూ ప్రయాణం చేశారు. ఒకే గర్భంలో ఒకే రక్తాన్ని, అది అందించే పోషణ్ని పీల్చుకుని తమ ఏక కణ జీవితాల్లోంచి బహు కణాలుగా పరిణామభ చెందారు. ఒకే వెచ్చదనాన్ని అనుభవిస్తూ వూపిరి పోసుకున్నారు.

ఒకే తల్లి చనుబాలను త్రాగి బాల్యాన్ని గడిపారు. ఒకే చోట గాలిని పీలుస్తూ యవ్వనాన్ని సంతరించుకున్నారు.

కాని ... ఇప్పటి వాళ్ళ ఆలోచనలు వేరు... అంతస్థులు వేరు.

సుభద్ర భర్త ముక్కు సూటి మనిషి! వ్యాపారంలో ప్రతి ఏడాదీ దెబ్బ తింటూనే వచ్చాడు.

సరుకును చీకట్లో దాచి, వెలుతురులో సానుభూతిని ప్రకటిస్తూ వచ్చిన వారికి లేదని చెప్పటం అతనికి చేత కాలేదు. అసలుకు కల్తీని చేర్చి, లాభాన్ని రెండింతలుగా బేరీజు వేసుకుని లక్షల్లో

లెక్కలు కట్టుకోవటం వూహల్లోకూడా అతనికి సాధ్యపడలేదు!

కూలిఖర్చూ, దారిఖర్చూ వేసుకుని, ప్రతి వస్తువుకు లాభాన్ని పైసల్లో జేర్చి, అమ్మకం ధరను అందరి కంటే భిన్నంగా నిర్ణయించి, అయ్యిన కాడికి కాలాన్ని దొర్లించుకుంటూ వచ్చాడు.

ఫలితంగా పిల్ల వివాహం సమస్యగా మిగిలిపోయింది. అయినా అతని కెంతో తృప్తి.

''శుభం! నా కెందుకో ఈ జనాన్ని చూస్తే మోసం చెయ్యబుద్ధి కావటం లేదు. కల్తీచేసి లాభాల్ని గడించటం ఎంత పాపమే ... మన పిల్లల్లాంటి పిల్లలేగదా వాళ్ళకీ ఉంది. ఎదుటి వారి కడుపుల్లో విషాన్ని పోసి, మనం అమృతం తాగా లనుకుంటే ఏదో రూపంలో అది మనల్ని కొడుతుంది. నిజాయితీగా ఉండే జీవితమూ, నా కీ పిల్లలూ, నువ్వూ ... ఈ జన్మ కిది చాలు ...'' అని భార్యతో అంటుండేవాడు.

భర్త నిజాయితీకి సుభద్ర ఎంతగానో మురిసి పోయేది. అందరికంటే భిన్నమైన మనసు ఆయనలో ఉన్నందుకు గర్వపడేది. నిజాయితీ మూర్తీభవించిన ఆ మనిషి నిష్కల్మషమైన ప్రేమలో కరిగిపోయేది.

● ● ●


''నాన్నా! వెళ్ళొస్తాను. శ్రీనివాసు వేం అనకు. వాడికి నచ్చిన అమ్మాయినే పెళ్ళి చేసుకోనీ ...'' సుభద్ర అని పిలుపుడింది.

''ఏ డిలా చెప్తూ డుమకోలేదూ!''

బలరాం ఆ మాట అంటూనే వెక్కి వెక్కి ఏడ్చాడు. కూతురు చేతుల్లో తల ఆన్చి కడుపు చెరువయ్యేలా బావురుమన్నాడు. సుభద్ర కూడా ఏడ్చింది. తర్వాత తండ్రిని సముదాయించింది.

''ఎందుకు, నాన్నా? వూరుకో...అన్నీ మనం అనుకున్నట్టు సాగుతయ్యా. ఎవరి కెంతవరకు ప్రాప్తమో అంతే ...''

''ఎవరికి చెప్పుకోను, తల్లీ, ఇంక— అది పోయిన దగ్గర నుంచీ ఈ ఇంట్లో ఏ చిన్న మెత్తు కార్యం జరిగినా, కాకితో కబురుచేస్తే నీవు స్వయంగా వచ్చి కష్టసుఖాలన్నీ చూసేదానివి ... తాయారును ఈ ఇంటి కోడలిగా తీసుకొచ్చుకుంటే నాకు ఏ భయం లేదనుకున్నాను. మనుమరాలి ఆదరణలో ముసలితనం సుఖంగా వెళ్ళబుచ్చా లనుకున్నాను. నా కంత అదృష్ట మేడది, తల్లీ— ఆ వచ్చే అమ్మాయి, ఎలాంటి దవుతుందో ... న న్నెలా చూస్తుందో...'' మరోసారి వెక్కిళ్ళు పడ్డాడు.




''అలా ఎందు కనుకోవాలి, నాన్నా! మంచి అమ్మాయి ఎందుకురాకూడదు?'' సుభద్ర అని, తండ్రికి మరి కాస్త ధైర్యం చెప్పింది.

చెప్పి సెలవు తీసుకుని వెళ్ళిపోయింది.

## 2

నెల తిరక్కుండానే సుభద్రకు తండ్రి దగ్గర నుండి శుభలేఖ వచ్చింది—వివాహం తిరుపతిలో జరుగుతున్నట్టూ, కుటుంబ సమేతంగా అంతా కదలి రావాలన్నట్టూ అందులో ఉంది. సుభద్రకు పోవాలనిపించలేదు కానీ, ఆమె భర్త —

''పోయిరా, శుభం! తప్పేముంది? నీవు పోకపోతే నలుగురూ ఏమనుకుంటారో తెలుసా— అమ్మాయిని చేసుకోలేదని అలుకబూనింది అంటూ నవ్వుతారు'' అన్నాడు.

భర్తలో ఉన్న ఆ సౌమ్య గుణానికి ఆమె కదిలి పోయింది. అప్పుడు ఆమె హృదయాంతరాళాల్లో ఒక భావం పెల్లుబికి శరీరం గగుర్పాటు చెందింది.

'ప్రపంచంలో సర్వదాస్తులా నాకు దూరమైనా సరే ... సంతోషంగా భరిస్తాను ... కానీ, ఈ గొప్ప మనసున్న ఈ మనిషి కెడంగా నేను క్షణం కూడా బ్రతకలేను. ఆయన మంచి మనసుకు నా చర్య మచ్చగా తయారు కాకూడదు. నలుగురూ నా భర్తను వేలెత్తి చూపే విధంగా నే నెందుకు ప్రవర్తించాలి. వెళ్తాను. వెళ్ళి సంతోషంగా వాళ్ళను దీవించి వస్తాను. కూతురును చేసుకోలేదని పిళ్ళకేం ఆవేదన లేదని నలుగురిలో నిరూపించి వస్తాను.'

''సరేనండి. వెళ్ళి వస్తాను'' అంది.

● ● ●

సుభద్ర తమ్ముడి వెంట తిరుపతి పోయింది. అటు వెళ్ళి కూతురు తరపు ఏడెనిమిది మంది వచ్చారు. ఇటు శ్రీనివాసు తరపు ఐదుగురు స్నేహితులు వచ్చారు. తమ్ముడి తరపు పెళ్ళి పెద్దగా తనే వ్యవహరించింది.

తమ్ముడు చేసుకున్న పిల్లనీ, తన మంగతాయారునీ ఒక సారి మనసులో పోల్చుకుంది.

మంగతాయారు ఎర్రగా ఉంటే ఆ పిల్ల చామనచాయ రంగులో ఉంది. ముఖంలో అంత అందం లేదు. మామూలు రూపం. మనిషి ఉండవలసినంత బొద్దుగా లేదు. సన్నగా ఉండి, కాస్త చలాకీగా మాత్రం ఉంది. మెడ నిండా పెట్టిన బంగారు నగలు మనిషికి మరింత కృత్రిమ రూపాన్ని సంతరించి పెట్టాయి.

ఏమున్నా, లేకపోయినా ఆ పిల్ల వెనుక శ్రీనివాసు కోరిన కట్నం ఉంది. అది లక్షల్లో ఉంది.

సలక్షణాలు తన తాయారులో ఉన్నా లక్షల్లేవు — లక్షల పిల్లే గెలిచింది! సలక్షణాలు అన్నీ ఉన్నపిల్ల వోడిపోయింది.

మనసులో సుభద్ర నిట్టూర్చింది!

తర్వాత త నలా నిట్టూర్చటం కూడా భావ్యం కాదని సరిపెట్టుకుంది.

వివాహం అయింది.

కారులో కూర్చున్నారు.

సుభద్ర ప్రక్కనే శ్రీనివాసు కూర్చున్నాడు. శ్రీనివాసు కెడంప్రక్క పెళ్ళి కూతురు కూర్చుంది. పెళ్ళి కూతురుతో పాటు నో నల్లని సూట్‌కేసు వచ్చింది. దానికోసమే శ్రీనివాసు కళ్ళు ఆబగా ఎదురు చూశాయి.

సూట్‌కేసు అందుకున్న శ్రీనివాసు దాన్ని వడిలో పెట్టుకున్నాడు.

పెళ్ళికూతురు వడిలో పచ్చి కొబ్బరికాయ ఉంది.

శ్రీనివాసు వడిలో సూట్‌కేసు ఉంది!

శుభ సంకేతం కొబ్బరికాయ లేకపోయినా పెళ్ళి జరుగుతుంది కనీ— నల్లని సూట్ కేస్, దానిలో రంగుల కాగితాలు లేకుండా ఇప్పుడే పెళ్ళీకాదు.

సుభద్ర మనసులోకి రకరకాల ఆలోచనలు వచ్చి మాయమవుతున్నాయి.

కారు కదిలింది. దాని వెనుక 'మరో కారు. దాని వెనుక మరో కారు. కలవారి వివాహాలు కార్లతోటే జరుగుతాయి. పేదవాడి పెళ్ళి కాళ్ళ నడకతో జరుగుతుంది.

మూడు కార్లూ కదిలాయి.

ముందు తామున్న కారు కదులుతుంది. తమ కారెంత ఖరీదయ్యింది. చాలా గొప్ప ఖరీదయ్యింది.

"మనుష్యుల్ని ముడివేసే ఖరీదు దీనిలో ఉంది. మనుష్యుల్ని విడదీసే ఖరీదు దీనిలో ఉంది.

ఈ ప్రపంచంలో ప్రతిదాన్నీ కొనగలిగిన ఖరీదు దీనిలో ఉంది. ఆ ఖరీదు సూట్‌కేసులో ఉంది! ఆ సూట్‌కేసు తన తమ్ముడి వడిలో ఉంది.

సుభద్ర చిన్నగా నవ్వుకుంది. తన మనసు విచిత్రంగా ఆలోచిస్తున్నందుకు ఆమెకే ఆశ్చర్యం వేసింది.

కారు కొండ దిగుతుంది. కొండంత ఐశ్వర్యాన్ని చిన్న సూట్‌కేసులో ఇముడ్చుకుని ... మెలికలు తిరుగుతూ ... వేగంగా మరింత వేగంగా కొండ దిగుతుంది.

సుభద్ర కా సమయంలో ప్రపంచమంతా పరిగెడుతున్నట్టు తోచింది. ఖరీదైన ఆ పరుక్కి ప్రకృతి భయపడి వెనక్కి జరుగుతోంది.

పూలూ, చెట్లూ, పక్షులూ, పశువులూ అన్నీ వెనక్కి జరుగుతున్నాయి. ఆకాశంలోని మేఘాలు మాత్రం ఈ పరుగును పరీక్షించేందుకు మెల్లిగా దాని వెంట జరుగుతున్నాయి.

జీవితం క్షణక్షణమూ అర్థం కాని మలుపులు తిరిగినట్టు కారు మలుపులు తిరుగుతుంది.

తమ్ముడూ! ఈ ఖరీదు మేం చెల్లించలేం. ఈ పరుగును మేం తీయలేం. ఈ మెలికలు మేం తిరగలేం — నీవు మా నుంచి దూరంగా జరిగిపో ... ఈ ప్రకృతి మాదిరి, ఖరీదు లేని ఈ చెట్ల మాదిరి, ఈ పూల మాదిరి, ఈ పిల్లగాలి మాదిరి, ఈ పక్షులు

మా దిరి మేం వెనక్కి జరిగిపోతాం!

సుభద్ర నవ్వుకుంది.

కారు కొండ దిగింది. ఖరీదైన మలుపులు తిరిగింది.

## 3

పెళ్ళికూతురు వెంట ఆమె చెల్లెలు వచ్చింది. తక్కిన వాళ్ళు వీడ్కోలు తీసుకుని వెళ్ళిపోయారు.

శ్రీనివాసు తన స్నేహితులకుమాత్రం ఎక్కడో డీలక్స్ హోటల్లో విందు చేశాడు. అంతకు వినా ... ఇంట్లో ఎవరికీ భోజనాలు పెట్ట లేదు.

ఇంటి కో పెళ్ళి కళ రాలేదు.

సుభద్రకు కొంచెం ఆశ్చర్యంవేసింది.

తండ్రి కొంచెం పిసినారి. ఆ విషయం తనకూ తెలుసు. ఇలాంటి సమయాల్లో నైనా ...

ఖర్చు చేయమనటం తన అభిమతం కాదు. చేయవలసిన పరిస్థితిలో కొంత చేయటం సంప్రదాయం.

చివరికి సుభద్ర ఏది ఎలా ఉన్నా తనకు అనవసరం అనుకుంది. పరిస్థితి తనది కాదు. తల దూర్చటం మంచిది కాదు. మరునటి దినం తను ప్రయాణమై పోవాలి. ఆ రోజు చీకటి పడింది.

సుభద్రకు ఆ రాత్రి నిద్రపట్టలేదు.

తను రాకుండా ఉంటేనే బాగుండేదని తలపోయటం మొదలెసింది.

ఒక అచ్చటా ముచ్చటా లేని వివాహం, చుట్టుప్రక్క లున్న నలుగురూ ఒక చోటకు చేరని వివాహం—అయినా తన కోసం ఎవరు వచ్చారు గనుక ఇలా పరుగెత్తుకు రావటం. తనకోసం నిజంగా తన తమ్ముడు రావద్దా?! ఒక్క కార్డు ముక్క వేసి నందుకే ఇలా పరుగెత్తుకు రావాలా?

మనసులోకి రకరకాల వూహలు ముసురుకుంటున్నాయి. అంతా పడు కున్నారు. ప్రక్క గదిలో పెళ్ళికుమార్తె, ఆమె చెల్లెలూ గాఢ నిద్రలోకి జారు కున్నారు. ప్రయాణంలో అలిసి పోయారు.

ఆ ఇంట్లో పనిచేసే సుబ్బమ్మ వరండాలో నిద్రపోతుంది. అమ్మ చచ్చి పోయిన దగ్గర్నుంచీ ఈ సుబ్బమ్మే వీళ్ళకు వంట చేసి పెడుతుంది. వయసు ముదిరిన మనిషి. ఏ భాగ్యవంతురాలో అయితే విశ్రాంతి తీసుకునేది. పేదరికం విశ్రాంతి తీసుకోనీదు.

సుభద్ర నిద్రపోయే సుబ్బమ్మ వంక జాలిగా చూసింది.

''అమ్మా! మంగ తాయారమ్మ ఎప్పుడొస్తదో ఈ ఇంటికి.'' సుబ్బమ్మ తనతో తరచూ అంటుండేది. కాని, మంగతాయారు రాలేదు. అనూహ్యంగా ఈ పరిణామం జరిగినందుకు సుబ్బమ్మ మనసులో ఏమనుకుంటుందో.

అయినా, ఆమె ఏం అనుకుంటే ఏం? ఎవరికి కావాలి? అనామకుల అభాగ్యుల ఆలోచనకు విలువ లెక్క డున్నాయి.

సుభద్ర పేలవంగా నవ్వుకుంది.


నిద్ర పట్టక వరండాలోకి వచ్చింది. పై అంతస్తులో ఏవో మాటలు వినిపి స్తున్నాయి.

తండ్రీ కొడుకులు! ఏమై ఉంటుందో

సుభద్ర కాళ్ళు అప్రయత్నంగా మెట్ల దగ్గరకు దారి తీశాయి. మెల్లిగా ఒక్కొక్క మెట్టే ఎక్కింది. మాటలు మరింత దగ్గరయ్యాయి.

''అదేమిటి నాన్నా! అక్క కని ఇచ్చిన డబ్బు అక్కకే ఇవ్వటం మంచిది కదా!''

''నీకు తెలీదు దుకోరా. ఈ బిచ్చ వేతో దాని దరిద్రం తీరదు. ఆడబిడ్డ కట్నం అంటే ఏమిటని నీ ఉద్దేశ్యం.



ఆడబిడ్డంటూ ఒకటి ఈ కొంపకు ఉన్నందుకూ, దాన్ని కొంత ఖర్చు పడి మనం సాగనంపినందుకూ—ఆ నష్టానికి సానుభూతిగా ఇచ్చే సైకం. అది దానికి చెందదురా—మనకే చెందుతుంది. నువ్వు నోరు మూసుకుని పడి ఉండు.''

''అన్నిటికీ ఇలాగే చెబుతున్నావ్.. మంగతాయారును చేసుకుంటా నంటే ససేమిరా వీల్లే దన్నావ్. అక్కకు నన్ను ఎదురు తిరగ మన్నావ్. అదేమంటే ఆస్తి చిల్లిగవ్వకూడా ఇవ్వనన్నావ్. నువ్వు దొంగ ఏడుపులేడ్చి అక్క దృష్టిలో మంచివాడి వయ్యావ్. నే నేమో. ఎదురు తిరిగి చెడ్డవాడి నయ్యాను. మంగ తాయారు ఎంత అందంగా ఉంటుంది నాన్నా!''

''పెద్దగా ఏడవకు. అందం కొరుక్కు తింటావా? లక్షన్నర రూపాయలతో వచ్చింది పిల్ల. ఎన్నాళ్ళు సంపాదిస్తే అవులయ్యేరా లక్షన్నర. ఈ కష్టమంతా ఎవరి కోసంరా? నీకోసం కదూ. వందల్లో ఉన్నవాళ్ళు వేలకీ, వేలల్లో ఉన్నవాళ్ళు లక్షలకీ, లక్షల్లో ఉన్న వాళ్ళు కోట్లకీ ఎగబాకాలిరా. అదే వ్యాపార రహస్యం. లక్షలకు లక్షలు కలవటమేరా పెరగట మంటే.

ఈ దేశాన్ని నడిపేది ఎవరో తెలుసా నీకు? అందాన్ని చూసి మోజు పడి పెళ్ళి చేసుకునే బికారి వెధవలు కాదు. డబ్బున్న వాళ్ళు. నీ చేతుల్లో లక్ష లున్నప్పుడు నీవీ దేశం యం. ఎల్. ఏ. లను నడుపు తావ్. మంత్రుల్ని నడుపుతావ్. పోలీసుల్ని నడుపుతావ్. అధికారుల్ని నడుపుతావ్.

పిచ్చి మొఖం! ఇంకో రహస్యం చెప్పనా ఈ రోజున దరిద్రంలో ఉన్న అందమైన ఒక మంగ తాయారును నువ్ ఈ ఇంటికి తీసుకొచ్చుకో వచ్చు. కానీ, నీవు లక్షల మీద కూర్చున్నప్పుడు అందంగా ఉండే వంద మంది మంగతాయారులు నీ చుట్టూ తిరుగుతారు.''

తండ్రి అంటున్న ఆ మాటలు వింటుంటే సుభద్రకు తల తిరిగింది. చివరి మాటలు ఆవేశాన్ని తెప్పించాయి. కానీ బలంగా ఆవేశాన్ని అణుచుకుంది.

కానీ ఆమె అంతరంగం ఎక్కడో దెబ్బ తింది. ఒక్కసారిగా దూసుకుంటూ ఆమె తండ్రీ, కొడుకులున్న గదిలోకి అడుగు పెట్టింది. అంతకు ముందు ఇచ్చిన కట్నం మొత్తం లెక్కబెట్టుకున్నారేమో—ఇద్దరి ముందూ వేళ్ళ రూపాయలు కట్టలుగా పోగుపడి ఉన్నాయ్.

ఆమె అలా దూసుకు రావటం, కళ్ళు ఎర్రబడి ఉండటం ముఖంలో ఆవేశం కనపడటం అంతా గమనించి తండ్రీ కొడుకులు అవాక్కై పోయారు.

సుభద్ర అంది—

''చూడు నాన్నా! లక్షలు సంపా దించిన వాళ్ళ చుట్టూ అందంగా ఉండే పేద మంగతాయారులు తిరుగుతారనే నీచాతినీచమైన భావం నీలోనే ఉంటే— దానికి ముందు మరో విషయంకూడా చెప్పు నాన్నా! దరిద్రంతో బాధపడే అందమైన సుభద్రలుకూడా ఉన్నారు. వాళ్ళే లక్షాధికారి చుట్టూ తిరుగు తున్నారో కొడుక్కు వివరిస్తే నీవు చెప్పే జీవిత సూత్రాలు బలంగా వాడి మనసులో నాటుకు పోతాయ్ నాన్నా!''

మరలా వెంటనే—

''చీచీ! నిన్ను నాన్నా అని పిలవటం నాకే అవమానం. అమాయకులైన పేద మంగతాయారులను మనుమరాళ్ళుగా చూడలేని నీ కళ్ళు—పేద సుభద్రలను కూతురులుగా సానుభూతిగా చూస్తా యని నే నెందు కనుకోవాలి.

కానీ ఒక్కటి మాత్రం గుర్తు పెట్టుకో. ఆస్తి పాశల మైకంలో నీ కళ్ళకు ఆత్మీయత విలువలు తెలీక పోవచ్చు. ఆ మత్తులో నీ ఇనప బీరువాల్లో నీవు సైకం నింపవచ్చు. కానీ. నీ వాళ్ళనుకున్న నీ సజీవమైన మనుషుల హృదయాల్లో నీ పట్ల ఆత్మీయతను నీ ఆరలోనూ నింపలేవు.

చిన్నతనంలో చదువు కునేప్పుడు, 'పయోముఖ విషకుంభం' అంటే సరైన అర్థం తెలిసేది కాదు. కనీ ఆ పదం అర్థాన్ని జీవితంలో ఇన్నాళ్ళకు ప్రత్య క్షంగా తెలుసుకుని వెళుతున్నాను''

అంటూ సుభద్ర మెట్లు దిగి, చకచకా బయటికి ఆ అర్ధరాత్రి నడిచి పోయింది. ఆమె కాళ్ళు రైల్వే స్టేషన్ వైపు కి నడిచి వెళుతున్నప్పుడు మేడపై అంతస్తు గదిలో తండ్రీ కొడుకులు శిలాప్రతిమల్లా అలాగే ఉండిపోయారు.

పైన తిరిగే పంకా గాలికి కిందున్న వంద రూపాయల నోట్లు ఆ మవునాన్ని చీల్చుకుంటూ ఫెళ ఫెళ మంటూ ఎగిరెగిరి పడుతున్నాయి! ★